ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
శుక్రవారం 18 ఏప్రిల్ 2025



గ్రంథాలయాల్లో నియామకాలు ఏవి..?
● 30ఏళ్లుగా పట్టించుకోని ప్రభుత్వాలు
● అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం 7

అరకొర వసతులు.. రోగుల అవస్థలు
● పీహెచ్‌సీ స్థాయి పెంపు చర్యల్లో జాప్యం 6

13 ఏళ్లుగా ప్రమోషన్లకు దూరం..

● జీవో 317తో అన్యాయం జరిగిందని ఎస్‌ఐల ఆవేదన
● పదోన్నతుల కోసం 102 మంది సబ్ ఇన్‌స్పెక్టర్ల ఎదురుచూపు
● బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త జోన్‌ల ఏర్పాటు



మంచిర్యాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో చేపట్టిన కొత్త జోన్‌ల ఏర్పాటు పోలీసుశాఖకు చెందిన పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లకు శాపంగా మారింది. జోన్‌ల ఏర్పాటుతో నిబంధనలు వర్తించక పదోన్నతులకు దూరం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం సబ్‌ఇన్‌స్పెక్టర్ల పోస్టులను భర్తీ చేసింది. అయితే అప్పటి నుంచి దాదాపు 13సంవత్సరాలు గడుస్తున్నా వారంతా ఇన్‌స్పెక్టర్ ప్రమోషన్లకు నోచుకోవడం లేదు. మల్టీజోన్-1లో ఉన్న ఈ బ్యాచ్ అధికారుల్లో దాదాపు అందరికీ ఇప్పటికే ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు లభించగా మల్టీజోన్-2కు చెందినవారికి ప్రమోషన్లు అందని ద్రాక్షలా మారాయి. 2012 బ్యాచ్‌కు చెందిన కొందరితోపాటు 2014బ్యాచ్‌కు చెందిన జూనియర్లు సైతం ప్రమోషన్లు పొందగా పదోన్నతికి నోచుకోని వారు తిరిగి వారి బ్యాచ్‌మేట్లకే సెల్యూట్ చేయాల్సి వస్తుందని మనోవేదనకు గురవుతున్నారు. 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 5వజోన్ నుంచి 146మంది ఎస్‌ఐలుగా పోలీసుశాఖలో చేరారు. అందులో 2021లో 45మంది ఎస్‌ఐలకు ఇన్‌స్పెక్టర్లు గా పదోన్నతి కల్పించారు. గతంలో 5వ జోన్‌లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలు ఉండేవి.

కాగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన 317 జీవోతో అవి మల్టీజోన్-1, మల్టీజోన్ -2గా ఏర్ప డ్డాయి. గతంలో 5వ జోన్‌లో ఉన్న కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాలతో పాటు కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట, మెదక్ జిల్లాలు మల్టీజోన్-1 పరిధిలోకి వచ్చాయి. ఈ కార ణంగా కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుంచి 66 మంది ఎస్‌ఐలు 5వ జోన్ ఎస్‌ఐలపైన సీనియారిటీలో చేరడంతో పదోన్నతిలో తీవ్ర అన్యాయం జరుగుతూ వస్తోంది.

● కొత్త జోన్ల ఏర్పాటుతో గందరగోళం...

బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన కొత్త జోన్ల ఏర్పాటు 2012 బ్యాచ్ ఎస్‌ఐలను గందరగో పరిస్థితిలోకి నెట్టింది. 2012 బ్యాచ్‌లో కేవలం 35 మందికి పదోన్నతి లభించగా వీరితో పాటు 2014 బ్యాచ్‌కు చెందిన ఇద్దరికి ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పించారు. 317 జీవో కారణంగా ఆరు సంవత్సరాలకే దక్కాల్సిన పదోన్నతులు... పన్నెండేళ్లు గడిచినా రాకపోవడంతో 102మంది ఎస్‌ఐలుగా మిగిలిపోయారు. పుష్కరకాలం గడుస్తున్నా పదోన్నతికి నోచుకోకపోవడంవల్ల వారంతా నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. దీన్ని నిరసిస్తూ పాత సీనియారిటీ ప్రకారమే పదోన్నతి కల్పించాలని, 317 జీవో వల్ల నష్టపోయామని 102మంది ఎస్‌ఐలు కొంతకాలంగా పాలకులు, పోలీసుశాఖ ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వం సరైన ప్రామాణికత లేకుండా తీసుకొచ్చిన 317జీవో కారణంగా పాత 6వజోన్‌లోని కొన్నిజిల్లాలు మల్టీజోన్-1లో కలపడంవల్ల ఆయా జిల్లాలకు చెందిన 66 మంది ఎస్‌ఐలు సీనియారిటీ జాబితాలో ముందుకు వెళ్లడంతో మిగితా వారికి అన్యాయం జరిగింది. ఈ కారణంగా..

(తరువాయి 7వ పేజీలో)

పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం

● జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారిణి రాజేశ్వరీ



సూరారంలో రైతు వేదికలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

దండేపల్లి (లక్షెట్టిపేట) ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం లభిస్తుందని ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి ఆ లోపాలను అరికట్టాలని జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారిణి రాజేశ్వరీ, లక్షెట్టిపేట ఐసీడీఎస్ సీడీపీవో రేష్మలు సూచించారు. పోషణపక్వాడ్ పక్షోత్సవాల సందర్భంగా పోషక అభియాన్‌ను లక్షెట్టిపేట మండలం సూరారం రైతు వేదికలో గురువారం లక్షెట్టిపేట ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు, గర్భిణులకు పోషకాహారం, సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. కార్య క్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల వనితా వాక్కు ఫౌండేషన్ కో-ఫౌండర్ కవిత, జిల్లా సమన్వయ అధికారిణి రజిత, సమన్వయ సహాయక అ ధికారిణి శ్యామల, జిల్లా మహిళ సాధికారిత అధికారిణి సౌజన్య పాల్గొన్నారు.

తాండూర్ : మాదారంలోని అంగన్‌వాడీ కేంద్రం 3లో గురువారం పోషణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి సీడీపీవో స్వరూపరాణి హాజరై గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ముర్రు పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయిం చారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్‌ఐ సౌజన్య, నా యకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సుభాష్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు



శెట్‌పల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

జైపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మిట్టపల్లి, కాన్కూర్, ముదిగుంట, గంగిపెల్లి, షెట్‌పల్లి గ్రామపంచాయతీల్లో పర్యటించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు వేరుగా సేకరించాలని, గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీల రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. నర్సరీలను పరిశీలించి మొక్కలు వందశాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఉద యం, సాయంత్రం మొక్కలకు నీరు పోయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు చలివేంద్రాలను అందుబాటులో ఉంచాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేసే వా రిపై చర్యలుంటాయన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శులు సాయికిరణ్, సురేందర్, సు రేష్, సత్యనారాయణ, ప్రతిభారాణి ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్,అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : లే అవుట్‌లోని భూ ముల క్రమబద్ధీకరణ కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారుల నుంచి రుసుము వసూలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ పేర్కొన్నారు. గురువారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 30లోగా రుసుము చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, రుసుం చెల్లించిన వారికి ప్రొసీడింగ్స్ అందించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్దిదారుల నుంచి రుసుము వసూలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈనె 30లోగా పూర్తిస్థాయిలో చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమీష నర్‌లు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

బెల్లంపల్లి, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. కట్టెలపొయ్యిపై వంటవార్పు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్లకాలంలో పేద ప్రజలకు చేసిందేమిలేదన్నారు. ప్రభుత్వం పెంచిన నిత్యావసర వస్తువులు గ్యాస్ డీజీల్ పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేందర్, నాయకులు శంకర్, నారాయణ, వెంకటేశ్వరగౌడ్, యాదగిరి, మల్లయ్య పాల్గొన్నారు.

బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. గత 17రోజులుగా బీసీల డిమాండ్ల సాధనకోసం ఢిల్లీలో ఆమరణ దీక్ష చేస్తున్న హిందూ బీసీ సభ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్‌కు మద్దతుగా గురువారం మంచిర్యాలలోని బీసీ భవన్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, రాజేశం, అంజయ్య, కొండయ్య, రామదాసు, అశోక్, శంకరయ్య, చరణ్, మధు, ప్రభాకర్, రవీందర్, రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి భూభారతి

● కలెక్టర్ కుమార్ దీపక్



లక్షెట్టిపేటలో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి(లక్షెట్టిపేట)ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరి ష్కరించి ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఉండేందుకే భూభారతీ చట్టాన్ని ప్రభుత్వం తీసుకవచ్చిందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. లక్షెట్టిపేటలో వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌లో గురువారం రైతు వేదికలో భూభా రతీ నూతన చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ ఆర్‌డీవో శ్రీనివాస్‌రావు హాజరై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతీ నూతన ఆర్‌వో ఆర్ చట్టం తీసుకవచ్చిందన్నారు. ఈచట్టంతో ఒకే రోజు రిజిస్ట్రేషన్‌తో పాటు మ్యుటేషన్ సౌకర్యం కల్పి స్తున్నట్లు ఆయన వివరించారు. రిజిస్ట్రేషన్ మ్యుటే షన్ సంబంధించిన భూమి సర్వే చేసి మ్యాప్ తయారు చేస్తారని పేర్కొన్నారు. తహసీల్దార్ ద్వారా భూ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యూటేషన్ చేస్తా రని తద్వారా నెలల తరబడి మ్యూటేషన్ కోసం తిరగడం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవడం ఉండదన్నారు. రికార్డుల్లో తప్పులు సవరణకు అవకాశం ఉంటుందన్నారు. పెండింగ్‌లో సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించడం కోసం ఈచట్టం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్‌చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేపట్టి భూమి హక్కులు ఏవిధంగా సంక్రమించినా, ముటేషన్‌చేసి రికార్డులో నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక మండలాన్ని ఎంపిక చేసి మండలంలోని అన్ని రకాల సమస్యలను తెలుసుకోని నిర్ణీత గడువులో పరిష్కరిస్తామన్నారు. వచ్చేజూన్ నుంచి పూర్తి స్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం లక్షెట్టిపేటలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకకృషి చేస్తుందన్నారు. ఈక్రమంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ దిలీప్‌కుమార్, ఎంపిడివో సరోజ, నాయకులు, రైతులు, అధికారులు ఉన్నారు.

న్యాయవాదిపై దాడి దుర్మార్గపు చర్య



మంచిర్యాలలో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

గర్మిళ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలోని జిల్లా కోర్టు భవనం ముందు గురువారం న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భుజం గరా వు మాట్లాడుతూ సూర్యాపేటలో కొందరు అడ్వకేటుపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు దత్తు, ఆంజనేయులు, రవి, శ్రీరాములు, తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: కోదాడ న్యాయవాది కిషోర్‌పై జరగిన దాడికి నిరసనగా లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్ట్ విధులను బహిష్కరించి కోర్ట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న దాడులు అరికట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షుడు నళినికాంత్, కోశాధికారి సుమన్ చక్రవర్తి, లైబ్రరీ సెక్రటరీ షెఫీక్, స్పోర్ట్ సెక్రటరీ బనావత్ సంతోష్, లేడి రెప్రెసెంటేటివ్ పద్మ, ఎగిక్యూటివ్ మెంబర్ రహేమతుల్ల పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీపీఐ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సింగరేణి క్వార్టర్లలో నివసిస్తున్నవారు ఇళ్లపట్టాలకోసం రుసుము చెల్లించినప్పటికీ పట్టాలు రాలేదన్నారు. దీంతో బ్యాంక్‌రుణాలు పొంద లేక ఇళ్లపట్టాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రేషన్‌కార్డులు ఎంతో మందికి లేకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని అర్హులందరికీ రేషన్‌కార్డులు వచ్చే విధంగా చర్యలు తీసుకో వాలన్నారు. పట్ట ణంలో డంపింగ్‌యార్డు లేక పారిశుద్యం అస్త వ్యస్తంగా మారిందని ఇండ్ల సమీపంలో రహదారుల పక్కన చెత్తకుప్పలు పేరుకపోయి ప్రజలు అనారోగ్యభారిన పడుతున్నారన్నారు. వెంటనే డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి శాశ్వతపరిష్కారం చూపాలన్నారు. పట్టణంలోని పలువార్డుల్లో మిషన్ భగీరథద్వారా వారానికోసారి నీరు సరఫరా చేస్తున్నారని దీంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేసవిలో నీటి ఎద్దడిలేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణకార్యదర్శి రాజమౌళి, రాష్ట్ర సమితి సభ్యులు వెంకటస్వామి, పూర్ణిమ, నాయకులు లక్ష్మీనారాయణ, రాజేశం పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అన్నారు. గురువారం పలువురు యువకులకు శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం కొందరిని నస్పూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గతంలో నేరాలు చేసిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు ఇక నుంచి సత్ప్రవర్తనతో మసలుకోవాలన్నారు. రాత్రిపూట పనీపాట లేకుండా తిరగకూడదని, ఎలాంటి నేరాలలో పాలుపంచుకో కూడదని అన్నారు. అలాంటి వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని, జైలుకు పంపుతామని హెచ్చరించారు. రౌడీషీట్ ఉన్న ప్రతీ ఒక్కరిపై నిఘా ఉంటుందని, మార్పు రాకపోతే పీడీయాక్ట్ అమలు చేస్తామన్నారు. కొంతమంది యువకులు, మైనర్లు గొడవలకు దిగుతున్నారని, తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలకు నచ్చజెప్పాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే 100కు డయల్‌చేసి తెలుపాలని, పోలీసువారి సహకారం తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎస్‌ఐ సంతోష్ ఉన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ వేణుచందర్

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు వేళాయే



● పదో తరగతి విద్యార్థులకు అవకాశం
● టీజీఆర్జేసీ సెట్-2025 నోటిఫికేషన్ విడుదల

దండేపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 35 గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి టీజీఆర్జేసీ సెట్-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పదవతరగతి పరీక్ష రాసిన విద్యార్థులు 2025-26 విద్యాసంవ త్సరానికి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ. రాష్ట్రవ్యాప్తంగా బాలురకు 15, బాలికల కోసం 20 గురుకుల జూనియర్ కాలేజీలు ఉండగా, ఇటీవల తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హు లు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థులు ఏప్రిల్ 23లోగా దరఖాస్తులను ఆన్లైన్‌లో సమర్పించుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారికి మే10న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు పొందుతారు. ప్రవేశపరీక్షలో మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 040-24734899 నంబరుకు ఫోన్‌చేసి సంప్రదించవచ్చు.

తరగతుల వివరాలు

ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూప్‌లలో 2996 సీట్లు ఉంటాయి. ఎంపీసీలో 1496, బైపీసీ 1440, ఎంఈసీ60 సీట్లు ఉంటాయి. విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను టీజీఆర్‌జేసీ.సీజీజీ.జీవోవీ.ఎన్ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేసుకోవాలి. దరఖాస్తు ఫీజు రూ.200 చెల్లించాలి. ప్రవేశపరీక్ష ర్యాంకు, రిజర్వేషన్ల ఆధారంగా కళాశాలలోకి ప్రవేశాలు కల్పిస్తారు.

పరీక్ష విధానం

టీఎస్‌ఆర్జేసీ కామన్ ఎంట్రెన్స్‌పరీక్ష మొత్తం 150మార్కులకు .నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం మల్టీపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది. విద్యార్థులు ఎంచుకునే గ్రూప్ ఆధారంగా సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలడుగుతారు. ఎంపీసీ విద్యార్థులకు ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ నుంచి, బైపీసీ విద్యా ర్థులకు ఇంగ్లిష్, బయోలజికల్ సైన్స్, ఫిజిక్స్ నుంచి అదే విధంగా ఎంఈసీ గ్రూప్‌లో చేరేవా రికి ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, మ్యాథ్స్ సబ్జెక్టుల నుంచి పదోతరగతి స్థాయిలో ఒక్కోసబ్జెక్టు నుంచి 50ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

● **పరీక్ష కేంద్రాలు** : ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

● **ఆన్లైన్ దరఖాస్తుకు చివరితేది** : 23 ఏప్రిల్ 2025
● **ప్రవేశ పరీక్ష తేది** : 10 మే2025.

అర్హులకు జూన్ 2న మంజూరు పత్రాలు

● ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : రాజీవ్ యువ వికాసం పథకలో అర్హులను గుర్తించి మంజూరు పత్రాలు ఎప్పుడి స్తారు?

ఎంపీడీవో : మండల స్థాయిలో రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించి జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తాం. అర్హులైన వారిని ఎంపిక చేసి జూన్2న మంజూరు పత్రాలు అందజేస్తాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో రాజీవ్ యువ వికాసం పథకానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

ఎంపీడీవో : రాజీవ్ యువ వికాసానికి మంచి స్పందన వచ్చింది. ఇప్పటికే మండలం లో వివిధ వర్గాలకు చెందిన యువత నుంచి 1,781 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎస్సీ 340, బీసీ 381, ఎస్టీ 351, మైనార్టీ 48, ఓసీ 48 దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి : తుది గడువు నాటికి దరఖాస్తులు ఇవ్వలేని వారికి అవకాశం ఉందా?

ఎంపీడీవో : ఈ నెల 14 వరకు గడువు ముగిసింది. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఎవరైనా ఉంటే దరఖాస్తులను స్వీకరిస్తాం. ఆన్‌లైన్‌లో లేని లబ్ధిదారు నుంచి దరఖాస్తులు తీసుకునే అవకాశం ఉండదు.

- బెజ్జూరు, ఆంధ్రజ్యోతి

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



అశోక్(ఫైల్)

దండేపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన గాండ్ల అశోక్ (45) అనే రైతు తన వ్యవసాయ బావిలో ప్రమాదశాత్తు కాలుజారి పడి మృతి చెందినట్లు దండేపల్లి ఎస్సై తహసినోద్దీన్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అశోక్ గ్రామ శివారు లోని ఉన్న పొలం వద్దకు గురువారం ఉదయం వెళ్లాడు. మళ్లీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంటి పక్కన ఉండే వ్యక్తిని పొలం వద్దకు పంపారు. అతను అక్కడకు వెళ్లి చేడగా ఒడ్డు వద్ద ఒక చెప్పు, బావిలో నీటిపై మరో చెప్పు కనిపిం చడంతో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వచ్చి బావిలో గాలింపు చర్యలు చేపట్టగా బావిలో మృతదేహం లభ్యం అయింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా చేశారు. అశోక్‌కు భార్య, కొడుకు, కుతూరు ఉన్నారు. అశోక్ భార్య శైలాజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య



లావణ్య(ఫైల్)

నెన్నెల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గడ్డం లావణ్య (47) అనే వివాహిత ఆర్థిక ఇబ్బందులతో గురువారం ఉదయం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. లావణ్య భర్త శంకర్‌గౌడ్‌తో కలిసి హోటల్ నిర్వహి స్తోంది. హోమ్‌లోన్ తీసుకొని ఇళ్లు నిర్మించుకున్నారు. హోటల్ పెట్టుబడి కోసం మరి కొంత అప్పు చేశారు. వ్యాపారం సరిగ్గా నడవక పోవడంతో అప్పు తీర్చడం కష్టమైంది. కిస్తులు చెల్లించక పోవడంతో వడ్డీ పెరిగిపోయింది. అప్పులు ఎలా తీర్చాలో తోచడం లేదని ప్రతి నిత్యం బాధపడేదని కుటుంబీకులు చెప్పారు. ఈ క్రమంలో గురువారం తెల్లారేసరికి లావణ్య ఇంట్లో కనిపించలేదు. ఆమెకోసం కుటుంబ సభ్యులు వెతగ్గా.. బీరన్న మర్రి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద ఆమె చెప్పులు, ముంత కనిపించాయి. అనుమానంతో బావిలోని నీటిని మోటర్ల సాయంతో తోడి చూడగా అందులో శవమై కనిపించింది. కొడుకు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నెన్నెల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మైలారం వాగు నుంచి జోగాపూర్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం జోగాపూర్ క్రాస్ వద్ద పట్టుకున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు దాడి చేసి ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. ఓనర్లు గడ్డం సాయికుమార్, కొమ్ము రాజన్న, డ్రైవర్లు పసుల రవీందర్, అత్తి సాయిలపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఇకపైన మండలం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కూలి పడ్డ తరగతి గది పెచ్చులు

విద్యార్థికి స్వల్పగాయాలు



గురువాపూర్ ఎంపీపీ పాఠశాలలో ఊడిపడ్డ పెచ్చులు

కాసిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గురువాపూర్ మండల ప్రాథ మిక పాఠశాలలో పై పెచ్చులు ఊడి విద్యార్థులపై పడ్డాయి. ఒకరికి స్వల్ప గాయాలతో బయట పడ్డారు. శిధిలావస్థలో ఉన్న బడికి మరమ్మతులు చేయాలని ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కాని గుత్తేదారు నిర్లక్ష్యం వల్ల బడిని అలాగే వదిలేశారు. గురువారం ఉపాధ్యాయులు పాఠాలు చెబుతుండగా ఒక్కసారిగా శబ్దం చేస్తూ పెచ్చులు ఊడిపడ్డాయి. అప్రమత్తమైన విద్యార్థులు పక్కకు తప్పుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి పాఠశాల మరమ్మత్తులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భార్యపై గొడ్డలితో దాడి చేసిన భర్త అరెస్టు

కోటపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భార్యపై గొడ్డలితో దాడి చేసిన భర్తను గురువారం అరెస్టు చేసినట్లు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వివరాలను వెల్లడించారు. మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన బానోత్ పున్నం తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తుందని అతడి భార్య బానోత్ లక్ష్మిని హతమార్చాలని గొడ్డలితో దాడి చేసి గాయపర్చాడని చెప్పారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు పున్నంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అరకొర వసతులు.. రోగుల అవస్థలు



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

● పీహెచ్‌సీ స్థాయి పెంపు చర్యల్లో జాప్యం

● సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజల వినతి

రెబ్బెన, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అరకొర వసతులతో రోగులు అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందించాలనే లక్ష్యం ఆశించిన మేర అమలు కావడం లేదు. పల్లె దవఖానాపై ప్రభుత్వం దృష్టి పెడుతున్నప్పటికీ పీహెచ్‌సీ స్థాయి పెంచక పోవడంతో రోగులు ఇబ్బం దులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పీహెచ్‌సీకి వచ్చే రోగులను దూర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రికు రెఫర్ చేస్తున్నారు. కొన్ని సార్లు రోగులను అక్కడకి తరలించే వరకు పరిస్థితి విషమించి ప్రాణాలు మీదుకు వస్తోంది. రెబ్బెన పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తే మెరుగైన వైద్యం అందే అవకాశం ఉందని చెబుతున్నాడు.

● సుమారు వంద మంది..

మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి ప్రతి రోజు సుమారు 100 మంది వరకు రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. పీహెచ్‌సీ పరిధిలో 25గ్రామ పంచాయతీలున్నాయి. సోమ, శుక్రవారాల్లో ఓపీ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో ఆసుపత్రి ఓపీ వంద దాటుతోంది. ఈ పీహెచ్‌సీ పరిధిలో నెలకు 15 నుంచి 20 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. అయినా అధికారులు ప్రస్తుతం పీహెచ్‌సిని సీహెచ్‌సీగా మార్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మంచిర్యాల-చంద్రాపూర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను పీహెచ్‌సీకి తరలిస్తే సిబ్బంది కేవలం ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెల్లంపల్లి, ఆసిఫాబాద్‌లోని ఆసుపత్రికు రెఫర్ చేస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రిలకు చేరే లోపు క్షతగాత్రులు పరిస్థితి మరింత విషమంగా మారుతోంది.

● 30 వేలలోపు జనాభా ఉంటే..

సాధారణంగా 30 వేలలోపు జనాభా ఉంటే పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తారు. ఆపై ఉంటే సీహెచ్‌సీ ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. రెబ్బెన మండలం ప్రస్తుతం 37వేలు జనాభా ఉందని అధికారుల లెక్కలే చెబుతున్నాయి. అయినా ఇంత వరకు సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ కావడం లేదు. నిత్యం ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు క్షేత్ర స్థాయిలో వ్యాక్సినేషన్ ఇతర కార్యక్రమాలు పరిశీలించేందుకు కేవలం ఒక్క డాక్టర్ మాత్రమే ఉండడంతో తీవ్ర పనిభారం పడుతోంది. దీంతో పాటు మెరుగైన వైద్యం అందడం లేదు. సీజనల్ సమయంలో రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో పనిభారం పెరుగుతోందని సిబ్బంది చెబు తున్నారు. పీహెచ్‌సీ కావడంతో కేవలం నాలుగు పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రోగులు ఎక్కువ సంఖ్యలో వైద్యంకోసం వస్తే సరి పోవడం లేదు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్‌చేస్తే వైద్య సిబ్బందితో పాటు ఆసుపత్రిలో పడకలసంఖ్య మరింత పెరుగనుంది. గతంలో ఆసుపత్రి సందర్శనకు వచ్చిన ఎమ్మెల్సీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని చెబు తున్నారు. అధికారులు స్పందించి సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

వాంకిడి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు వాహనాల్లో అక్రమంగా పశువులను తరలిస్తుండగా వాంకిడి మండలం అకిని గ్రామ సమీపంలో గురువారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. అనుమతులు లేకుండా వాహనాల్లో మహారాష్ట్రలోని గడ్చందూర్ వైపు నుంచి రాజారాంపల్లి మార్కెట్‌లో విక్రయించేందుకు ఎనిమిది ఎద్దులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సవ్వాతికి చెందిన డ్రైవర్ షేక్ ఫకృద్దీన్, వాంకిడికి చెందిన మహ మ్మద్ మూర్తుజ్ అలీ, మహమ్మద్ అజీమ్, మహమ్మద్ ముఫీద్ అలీ, మహమ్మద్ ముకేత్ అలీ, ముకేత్ అలీ, గోయగాంకు చెందిన మోసీన్‌ఖాన్, వాంకిడి చెందిన కుతుబుద్దీన్‌లపై కేసు నమోదు చేశామని చెప్పారు. పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించామని తెలిపారు.

బీట్ అధికారిపై దాడి చేసిన ఇద్దరి అరెస్టు

జన్నారం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇందన్‌పల్లి రేంజ్‌లోని భర్తన్‌పేట్‌లో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రుబీనాతలత్‌పై దాడి చేసి విధులను ఆటంకరపర్చడంతో పాటు ఆమె భర్తపై దాడి చేసిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసి లక్షెట్టిపేట కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. రుబీనా ఫిర్యాదు మేరకు ఈ నెల 7న కేసు న మోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన కవ్వాలకు చెందిన ఎండీ ఎజాజోద్దీన్, జన్నారానికి చెందిన రియాజోద్దీన్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి 14 రోజులు రిమాండ్ విధించి నట్లు తెలిపారు. నిందితులను లక్షెట్టిపేటలోని జైలుకు తరలించినట్లు తెలిపారు.

భక్తి ముసుగులో మోసం

హనుమాన్‌మాల ధరించి తిరుగుతున్న ముఠాలు

ఒకరిని పట్టుకొని పోలీసుస్టేషన్‌లో అప్పగింత

కాసిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ మాలాధారణ వేషంలో ఉన్న కొందరు గ్రామాల్లో తిరుగుతూ డబ్బులు వసూ లు చేయడం కాసిపేట మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల నుంచి మారు మూల గిరిజన ప్రాంతాల్లో ముఠాలుగా సంచరిస్తూ డబ్బులు డిమాండ్ చేయడం పలు అనుమానాలకు తావిచ్చింది. హను మాన్ వేషధారణలో ఉండి బిక్ష(అన్నదానం) కోసం వసూలు చేస్తున్నామంటూ అమాయక ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. గురువారం కొండాపూర్‌యాప వద్ద మహిళను బిక్ష కోసం డబ్బులు ఇవ్వాలని అడుగగా లేవని సమాధానం చెప్పింది. స్వామి మహిళపై ఆగ్రహంతో మహిళను దూషించాడు. దీంతో మహిళ భర్తకు సమాచారం అందించింది. అనుమానం వచ్చిన స్థానికులు అతన్ని పట్టుకొని స్థానిక దేవాపూర్ పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు స్థానికులు తెలిపారు. అతన్ని పూర్తి స్థాయిలో విచారించగా వరంగల్ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

గత నెలలో కొండాపూర్ యాపకు చెందిన ఒకరి ఇంటికి వెళ్లి నీ భర్తకి ప్రాణగండం ఉందని రెండు రోజుల్లో చనిపోతాడని స్వామి మహిళకు చెప్పడంతోమహిళ భయాందోళనకు గురైంది. 20వేలు ఇస్తే నీ భర్తకు ఏం జరుగకుండా పూజలు చేస్తానని నమ్మబలికాడు. తన వద్ద 9వేలు ఉన్నాయని అతనికి ఇవ్వడంతో పూజలు చేసి ఉడాయించాడు. చివరకు కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని స్వామిని వెంబడించి అతని వద్ద నుంచి 9వేలు తీసుకున్నారు. ఇలా ప్రతి రోజు కొందరు ముఠాలుగా ఏర్పడి గ్రామాల్లో తిరుగుతూ ప్రజల వద్ద నుంచి బిక్ష పేరుతో సొమ్మును కాజేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ముఠాలుగా ఏర్పడి గ్రామాల్లో తిరుగడం పట్ల స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసుశాఖ స్పందించి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జర్నలిస్టులకు రాజీవ్‌యువ వికాసం పథకం వర్తింపజేయాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంను జర్నలిస్టులకు వర్తింప చేయాలని గురువారం తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టు వృత్తిలో ఉండి సేవలం దిస్తున్నారని ఇందులో పేద, మధ్యతరగతికి చెందిన జర్నలిస్టులు ఉన్నారని చెప్పారు. వీరందరికి రాజీవ్‌యువ వికాసం పథకం అమలు చేయాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌జేయు జిల్లా అధ్యక్షులు రాజు పటేల్, ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

తాండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న వారందరికి ఉపాధి పనులను కల్పించాలని మండల ప్రత్యేకాధికారి అంజయ్య పేర్కొన్నారు. గురువారం తాండూర్ ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని, వేసవిలో తాగునీటి కొరత లేకుండా చూడాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పౌష్టికాహారం పంపిణీ, పిల్లల ఎత్తు, బరువులను పర్యవేక్షించాలన్నారు. ఉపాధి కూలీలు పనులు చేసే నీడ, తాగునీటి సౌకర్యాలను కల్పించాలన్నారు. పారిశుధ్య పనులను గ్రామాల్లో ముమ్మరంగా నిర్వహించా లని సూచించారు. చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీవో అనిల్‌కుమార్, ఎంఈవో మల్లేశం, ఏపీఎం పూమానాయక్, ఏపీవో నందకుమార్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో

తాండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం తాండూర్ మేదరివాడ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి నీటి కుళాయిల నుంచి సరిపడ నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. చాలా చోట్ల పైపులు పగిలి నీ రు వృధా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్ప టికైనా అధికారులు పట్టించుకుని వెంటనే నీటి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని తెలిపారు.. విషయం తెలుసుకున్న తాండూర్ పంచాయతీ ఈవో దివాకర్ ధర్నా వద్దకు చేరుకుని వారం రోజుల్లో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించి వెళ్లిపోయారు.

భూ సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు

వాంకిడి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం ద్వారా భూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టంపై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం ద్వారా హక్కులు భూ సమస్యలు సత్వర పరిష్కారం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టం రైతులకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ఈ చట్టం వల్ల నిజమైన భూమి య జమానికి న్యాయం జరుగుతుందని తెలిపారు. ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని ప్రభు త్వం తీసుకు వచ్చిందన్నారు. రికార్డులలో త ప్పుల సవరణకు అవకాశం ఉందని చెప్పారు. భూ సమస్యల పరిష్కారంలో అప్పీల్ వ్యవస్థ ఉందన్నారు. తహసీల్దార్ జారీ చేసిన ఆర్డర్‌పై ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవచ్చని సూచించారు. ఆర్డీవో మండలాధికారి జారీ చేసిన ఆర్డర్‌పై కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే వెసులుబాటు తీసుకువచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్‌లో ఈ అవకాశం లేదన్నారు. విరాసత్ పట్టా మార్పిడిపై సంబంధిత పట్టాదారులకు నోటీసులు జారీ చేసే విధానాన్ని తీసుకు వచ్చిందన్నారు. కొనుగోలు, దానం, తనఖా, పాలు పంపకాల ద్వారా భూమిపై హక్కు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులలో మార్పు చేసి పట్టాదారు పాసు పుస్తకం జారీ చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియ ఒకే రోజులో పూర్తి అయ్యే విధంగా చట్టంలో పొందుపరిచారని చెప్పారు. భూ భారతిలో చాలా సులభమైన మాడ్యూల్ ప్రభుత్వం తీసుకు వచ్చిందని అన్నారు. ఇది రైతులకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ప్రతి రైతు భూ భారతి చట్టంలోని హక్కులు, అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కేశవనాథ ఆలయ భూముల ఆక్రమణ

» ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న పలువురు

» పట్టించుకోని అధికారులు



ఆలయ భూముల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు



దేవాదాయశాఖ అధికారులతో వాగ్వాదానికి దిగిన ఆక్రమణదారులు(ఫైల్)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామ శివారులో ఉన్న శ్రీ కేశవనాథ ఆలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. మండలంలోని జన్కాపూర్ శివారు సర్వే నంబర్లు 80ఏ, 80బీ, 81, 82, 83, 84, 85, 94లలో 89.13 ఎకరాల విస్తీర్ణంలో ఆలయానికి చెందిన భూములు దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. గోవింద్‌పూర్ గ్రామానికి ఆనుకుని ఉన్న 83 సర్వే నంబరులోని భూమి ఆక్రమణకు గురవుతున్నది. ఈ భూముల్లో కొంత మంది ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకుంటున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భూములను ఏటా కౌలు నిమిత్తం వేలం నిర్వహించి తద్వార వచ్చిన పైకాన్ని దేవాదాయ శాఖ ఆలయ కమిటీ ఖాతాలో జమ చేసి ఆలయాభివృద్ధికి నిధులు వెచ్చిస్తారు. వేలం ద్వారా ఆలయానికి ఏటా సుమారు రూ.20 లక్షల మేరకు ఆదాయం సమకూరుతోంది. కానీ ఆలయ భూముల రక్షణ ను సంబంధత అధికారులు పట్టించు కోవడం లేదని చెబుతున్నారు.

సర్వే నంబరు 83లో..

కేశవనాథ ఆలయానికి సంబంధించిన 83 సర్వే నంబరులోని 8.22 ఎకరాలు గోవింద్‌పూర్ గ్రామంలో ఉన్నాయి. ఈ భూమిలో కొంత మంది 1.18 ఎకరాల్లో షెడ్లను ఏర్పాటు చేసుకున్నారు. దేవాదాయ శాఖాధికారులు గతంలో భూమిని సర్వే చేయించగా భూమిని ఆక్రమించిన వారికి నోటీసులు సైతం అందజేశారు. దీంతో అప్పట్లో పలువురు రాజకీయ నాయకులను ఆశ్రయించడంతో 2001లో 1.18 ఎకరాల్లో తాత్కాలికంగా షెడ్లు నిర్మించుకున్న వారితో ఏటా భూమికి అద్దె చెల్లించే విధంగా ఒప్పందం ఏర్పర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం అద్దె చెల్లించకుండా ప్రస్తుతం అదే స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్ల పక్కా భవ నాలను నిర్మాణాలు చేప ట్టడంతో దేవాదాయ శాఖా ధికారులు వాటిని బుధవారం అడ్డుకున్నారు. దీంతో గ్రామస్థులకు, అధికారులకు మధ్య కొద్ది సమయం వాగ్వాదం చోటు చేసుకుంది. ఇందిరమ్మ లబ్ధిదారులు స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్‌లు లేక పోయినప్పటికీ సంబంధిత అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. కేశవనాథ ఆలయ భూముల కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు ఇచ్చినా సంబంధిత అధికారులు సర్వే చేపట్టక పోవడంతో భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. దేవాదాయ శాఖకు చెందిన భూములకు కొలతలు చేపట్టి సరిహద్దులు ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వెనక కొంత మంది నాయకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవాదాయ భూములు అన్యాక్రాంతం అవుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని భూముల్లో అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..



గోవింద్‌పూర్ శివారులోని కేశవనాథ ఆలయ భూముల్లో కొంత మంది నిర్మాణాలు చేపట్టడంపై కలెక్టర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఆలయ భూముల పరిరక్షణకు పాటుపడుతాం.

- వేణుగోపాల్‌గుప్తా, ఆలయ కార్యనిర్వాహణాధికారి

గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలోని అరవింద్ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పౌరసరఫరాల శాఖ అధికారికి ఎంసీపీఐయు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గ్యాస్ ఏజెన్సీవారు డెలీవరి చార్జీలు తీసుకుంటున్నారని గ్యాస్ ధరలు సైతం అధికంగా తీసుకుంటు న్నారని వినతిలో పేర్కొన్నారు. ఐద కిలోమీటర్ల పరిదిలో గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా డెలీవరి చేయాలనే నిబంధనలు ఉన్నప్పటికీ డెలీవరి చేయకుండా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేశ్, అఖిలభారత మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి లక్ష్మీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

వేమనపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. గురువారం వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో నీటి సమస్య లేకుండా చూడాలని, మిషన్ భగీరథ నీటిని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎంపీడీవో కుమారస్వామి, తహసీల్దార్ రమేష్, ఎంఈవో తిరుపతిరెడ్డి, పశువైద్యాధికారులు సుప్రియ, ప్రవీణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సాయికిరణ్, ప్రదీప్, ఇరిగేషన్ ఏఈ వంశీ, పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంచాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాస్ పథకం గడువు పెంచాలని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బింగి సదానందం ఒక ప్రకట నలో కోరారు. దరఖాస్తు గడువు ఈ నెల 14వ తేదీతో ముగిసిపోయిందన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి గడువు పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. షరతులు లేకుండా రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయాల్లో నియామకాలేవి..?

- 30ఏళ్లుగా పట్టించుకోని ప్రభుత్వాలు
- అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం

బెల్లంపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎందరో విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తును నిర్ణయించే గ్రంథాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రంథాలయాలకు నిధులు, వసతులు లేని సిబ్బంది కొరతతో పాటు సెస్ వంటి పట్టిపీడిస్తున్నాయి. దశాబ్దాల కాలంగా గ్రంథాలయాల్లో సిబ్బందిని ప్రభుత్వం నియమించక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే పలు గ్రంథాలయాలు సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతున్నాయి.



బెల్లంపల్లి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం

జిల్లాలో 14 గ్రంథాలయాలు...

జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో 14 గ్రంథాలయాలు ఉన్నాయి. కన్నెపల్లి, హాజీపూర్, భీమారం మండలాల్లో ఇప్పటికీ గ్రంథలయాలు లేవు. జిల్లాలోని గ్రంథాలయాల్లో మొత్తం రెండులక్షల 30వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. దీంతో పాటు గ్రంథాలయాలకు పది సొంత భవనాలు ఉండగా అద్దె భవనంలో ఒకటి కొనసాగుతుండగా మరో మూడు ఆయా మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగుతున్నాయి. ఇందులో కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. కొన్ని మండలాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటికీ ఆచరణలో నోచుకోవడం లేదు. అలాగే సాంకేతిక కాలానికి తగ్గట్టుగా ఈ-గ్రంథాలయాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదు.

పేరుకుపోతున్న సెస్ బకాయిలు..

జిల్లాలోని గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలు ఏటా వసూళ్లు చేసే ఆస్తి పన్నులో 8శాతం గ్రంథాలయ సెస్‌లు చెల్లించాల్సి ఉంటుంది. చెల్లించిన నిధులను జిల్లా గ్రంథాలయ సంస్థ ఖాతాల్లో జమ చేస్తారు. ప్రతి ఏటా ఈ ప్రక్రియ వందశాతం జరగకపోవడంతో గ్రాంథాలయాలకు రావాల్సిన సెస్ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దాదాపు 45లక్షలకు పైగా సెస్ వసూలు కావాల్సి ఉంది. సెస్ సకాలంలో వసూలు కాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. సెస్ ద్వారా వచ్చిన నిధులతో ఆయా గ్రంథాలయాల్లో విద్యుత్ బిల్లు, తాత్కాలిక ఉద్యోగుల జీతాలు, దిన, మాస పత్రికలు బిల్లులు చెల్లిస్తుంటారు. దీనికితోడు గ్రంథాలయాలకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు, మరమ్మతులు శాశ్వత భవనాలు గదుల నిర్మాణానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైన ప్రభుత్వం గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి సమస్యల పరిష్కారానికి నిధులు కేటయిస్తే ఎంతో మంది విద్యార్థులకు, నిరుద్యోగులకు మేలు చేకూరుతుంది.



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతులు

30 ఏళ్లుగా నియామకాల ఊసేలేదు...

జిల్లాలోని గ్రంథాలయాల్లో ప్రభుత్వం భర్తీ చేపట్టడం లేదు. 1994లో భర్తీలు చేపట్టి నేటికి 30ఏళ్లు దాటుతు న్నప్పటికీ ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. జిల్లాలోని ఆయా గ్రంథాలయాల్లో ఐదు గురు శాశ్వత ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి పోస్టు సైతం ఖాళీగానే ఉంటోంది. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్, రికార్డు అసిస్టెంట్, లైబ్రరియన్, వాచ్‌మెన్‌ను నియమించాల్సి ఉండగా అవి ఖాళీగానే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రంథాల యాల్లో దాదాపు 20వరకు ఖాళీపోస్టులు భర్తీ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వే యడం లేదు. ఒకే గ్రంథాలయ అధికారి రెండుమూడు చోట్ల ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తుండడంతో గ్రంథాలయాలపై సరైన దృష్టి సారిరచడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

13 ఏళ్లుగా ప్రమోషన్లకు దూరం..

(5వ పేజీ తరువాయి)

దాదాపు 102 మంది ఎస్ఐలకు పదోన్నతులు రాక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఎవరు కూడా ఇంత సుదీర్ఘకాలం పాటు ఎస్ఐలుగా పనిచేసిన సందర్భాలు లేవు. ఇదిలా ఉండగా పోలీసుస్టేషన్ల అప్‌గ్రేడేషన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని పాత 6వ జోన్‌లో అప్‌గ్రేడేషన్ జరిగింది. అయితే పాత 5వ జోన్ అయిన వరంగల్ జిల్లాలో మాత్రం ఇప్పటికీ 54 పోలీసుస్టేషన్‌లు అప్‌గ్రేడేషన్‌కు నోచుకోలేదు. దీంతో ఎస్ఐల పదోన్నతులకు మోక్షం లభించడం లేదు. 317 జీవో వల్ల జరిగిన నష్టాన్ని గుర్తించి పాత సీనియారిటీ ప్రకారం తమకు పదోన్నతి కల్పించాలని 2012 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఒకే బ్యాచ్‌కు చెందిన పలువురికి పదోన్నతి, మరికొందరికి నష్టం కలిగించే విషయాన్ని ప్రభుత్వం గుర్తించి పదోన్నతి కల్పించాలని వేడుకుంటున్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో రజతోత్సవ మహాసభ వాల్‌పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్ని బోగస్ అని తేలిపోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు భయపడి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి వేల మంది తరలిరానున్నట్లు తెలిపారు. రానున్న రోజులు బీఆర్ఎస్‌వేనని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరికి భయపడవద్దని పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు బత్తుల సుదర్శన్, నూనేటి సత్యనారాయణ, బడికెల శ్రావణ్, సబ్బని అరుణ్,రేవెల్లి విజయ్, రామన్న, గోలి శివ, పాల్గొన్నారు.

పాత బకాయిలు పూర్తి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 యాసంగి దాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని, రైసుమిల్లర్లు పాత బకాయిలు పూర్తి చేసి బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. గురువారం ఆయన చాంబర్‌లో రైసుమిల్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాయిల్డ్ రైసుమిల్లర్లకు గతంలో కేటాయించిన ధాన్యం లక్ష్యాలకు సంబంధించి పాత బకాయిలను లేకుండా పూర్తి చేయాలని, బ్యాంక్ గ్యారంటీలు వెంటనే ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఈ సీజన్‌లో దాన్యం కేటాయించన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబాలకు వారి స్థానాల్లో ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులు విధులు నిర్వహిస్తున్న సమయంలో అనారోగ్యాల బారినపడకుండా దుస్తులు, మాస్కులు, చేతికి ధరించే గ్లౌజెస్ అందించాలన్నారు. అలాగే రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు మహేశ్, నాయకులు శ్రీనివాస్, రాజేశ్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం

చెన్నూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎంవీ పట్వర్ధన్‌ను గురువారం అధ్యాపకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఇటీవల హైదరాబాద్‌లోని తెలుగు విశ్వ విద్యాలయంలో ప్రజా పద్యం, అవధాన పరిషత్ సౌజన్యంతో మూడు రోజుల పాటు నిర్వహించిన శతవధానం కార్యక్రమంలో పట్వర్ధన్‌పాల్గొని తెలుగు సాహిత లోకాన్ని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు చెన్నూరు పట్టణంలో చాటారు. ఇందుకు గాను ఆయనకు శతవధాన ద్యుమణి అనే బిరుదును అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కిశోర్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్ పట్వర్ధన్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

గిరిజన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

వేమనపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగెనపల్లి గ్రామానికి చెందిన గిరిజన యువకుడు కన్నయ్య అతని యాజమాని ఎనగంటి చిన్నన్న, అతని భార్య లక్ష్మీ వేధింపులు భరించ లేక ఆత్మహత్య చేసుకున్న గిరిజన యువకుడు నాయిని కన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం మంగెనపల్లిలోని కన్నయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ప్రజా సంఘాల నాయకులతో కలిసి కన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతాప సభలో ఆయన మాట్లాడుతూ గిరిజన యువకుడు మరణించి 15 రోజులు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కన్నయ్య కుటుంబానికి చెందిన సీలింగ్ పట్టా భూమిని ఎనగంటి చిన్నన్న కొడుకు అక్రమంగా పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. కన్నయ్య మృతికి కారణమైన చిన్నన్నతోపాటు అతని భార్యపై, అక్రమంగా పట్టా చేసుకున్న హరీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం కన్నయ్య కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, 5 ఎకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉపాధ్యక్షుడు సచిన్, రవికుమార్, శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాగాల రాజన్న, ఎర్మ పున్నం, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, ఉమారాణి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

అమ్మనాన్న చదువుకు సహకరించాలి

కాసిపేట, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): నిరక్ష్యరాసులైన అమ్మనాన్నలకు చదువు చెప్పి మండలంలో వందశాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో అందరూ సహకరించాలని డీఆర్‌పీ బండ శాంఖారి అన్నారు. గురువారం దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అమ్మనాన్న చదువుపై పిల్లలకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌రాథోడ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

భీమారం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారుల తో పాటు ప్రజలు కృషి చేయాలని భీమారం ఎస్ఐ శ్వేత పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు, ద్విచక్రవాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్యపానం చేసి వాహనాలను నడపవద్దని, వాహనాలు నడుపు నప్పుడు సంబంధించిన ధృవపత్రాలు ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనంలో ఎక్కించుకోవదన్నారు.

'గ్రాడ్యుయేషన్ డే'తో విద్యార్థులకు ప్రోత్సాహం

శ్రీరాంపూర్, ఏప్రిట్ 17(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంతో విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నట్లు శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ జక్కెన రమేష్, ప్రిన్సిపాల్ జహీదా బేగం పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

జన్నారం : మండలంలోని కలమడుగు గ్రామంలోని వివేకా నంద పాఠశాలలో ప్రీ ప్రైమరీ పూర్తయిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ సతీష్‌గౌడ్, ఉపాధ్యాయులు తిరుపతిగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

జైపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని పీఏసీఎస్ చైర్మన్ గుండు తిరుపతి, వైస్ చైర్మన్ సంతోషం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2320, అదనంగా రూ. 500 బోనస్ సన్నరకం వడ్లకు ఇస్తుందన్నారు. కామన్ గ్రేడ్ రకానికి రూ. 2300 మద్దతు ధర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంబర్‌రెడ్డి, మంతెన లక్ష్మణ్, శీలం వెంకటేష్, రాజన్న, గోనె నర్సయ్య, రవి, రిక్కుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దండేపల్లి: రైతులు ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులు, వివో లీడర్లుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను దళారులకు అమ్ముకొని మోసపోవద్దని, గ్రామాలోని ఎర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించాలన్నారు.

ప్రభుత్వ రైతులకు మద్దతు ధర కల్పించి రైతు సంక్షేమానికి అండగా నిలబడుతుం దన్నారు. అన్నదాతలు కూడా నాణ్యమైన ధాన్యం తీసుకవచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏడిఏ అనిత, ఐకేపి ఏపీఎం బ్రహ్మయ్య, ఏఎంసి డైరెక్టర్ల రాకేష్, సునీత, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు శంకరయ్య, పుష్పలత, కళ్యాణి, యశోధ, నాయకులు, ఐకేపీ సీసీలు. వివో లీడర్లు, గ్రామైఖ్య సంఘాల సభ్యులు, రైతులు, హమీలీలు తదితరులు పాల్గొన్నారు.



నర్సింగాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వాహనాల నంబర్ ప్లేట్లపై పోలీసుల నజర్

శ్రీరాంపూర్, ఏప్రిట్ 17(ఆంధ్రజ్యోతి): సక్రమంగా నెంబర్ ప్లేట్ లేకుండా, ఇష్టారీతిన నెంబర్ ప్లేట్ రాయించుకొని తిరుగుతున్న వాహనాలపై శ్రీరాంపూర్ పోలీసులు ప్రత్యేక నజర్ పెట్టారు. ఎస్ఐ సంతోష్, బ్లూ కోల్ట్ సిబ్బంది సత్యనారాయణ, ఆంజనేయులు గత నాలుగు రోజులుగా ప్రతి రోజు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ లేని, ఇష్టారీతిన నెంబర్ ప్లేట్లు బిగించుకున్న వారిని పట్టుకుంటున్నారు. నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించి తిరిగి వదిలిపెడుతున్నారు. సరైన పత్రాలు లేకుంటే జరిమానాలు విధిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ మాట్లాడుతూ, బ్లూ కోల్ట్ సిబ్బందితో ప్రతి నిత్యం వాహనాల తనిఖీలు చేయిస్తున్నామన్నారు. నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్లు బిగించి తిరిగి వదిలిపెడుతున్నామన్నారు. ప్రతి రోజు ఇలాంటి వాహనాలు 20 వరకు పట్టుకుంటున్నామని, ఈ కార్యక్రమం ఇక నుంచి ప్రతి రోజు కొనసాగుతుందని చెప్పారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దండేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలం నంబాల గ్రామ శివారులో ఓరహస్య ప్రదేశంలో పేకాట స్థావరంపై గురువారం సాయంత్రం పోలీసులు దాడులు చేసి నలుగురి పట్టుకున్నట్లు ఎస్సై తహసినోద్దీన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ 7500 రుపాయలతో పాటు పేకాట ముక్కలను స్వాధీనం పర్చుకున్నారు. నాలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కోన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

గర్మిళ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌వో పరీక్షలో మంచిర్యాల శ్రీ చైతన్య టెక్నో స్కూల్ లక్ష్మీనగర్ బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ఏజీఎం అరవింద్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఆయూబ్ తెలిపారు. గురువారం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జయరాజ్, నాగరాజు, జయశ్రీ, అనగమాత, స్వాతి, ప్రియాంక పాల్గొన్నారు.



విద్యార్థులతో ఏజీఎం, ప్రిన్సిపల్

ఆదర్శకాలనీగా తీర్చిదిద్దుతాం..

బెల్లంపల్లి గడ్డం వినోద్ వెంకటస్వామి

కాసిపేట, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): దుబ్బగూడెం పునరావాసకాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శకాలనీగా తీర్చిదిద్దుతానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. గురువారం దుబ్బగూడెం ఆర్ అండ్‌ఆర్ కాలనీలో అర్హులకు ఇండ్ల స్థలాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి కళ్యాణఖని మెగా ఉపరితల గని ఏర్పాటులో దుబ్బగూడెం ముంపునకు గురైంది. కేకేఓసీపీ ఏర్పాటుకు సహకరించిన నిర్వాసితులను ఆయన అభినందించారు. అలాగే దుబ్బగూడెం పునరావాసకాలనీలో అన్ని మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. 299 మందికి ఇండ్ల పట్టాలు అంద జేశారు.

పట్టాల పంపిణీలో గందరగోళం..

అర్హులైనవారికి కాకుండా కొందరు బినామీలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వడాన్ని స్థానికులు నిరసిస్తూ ఆందోళనకు దిగారు. 60 మంది లబ్దిదారులకు ఇండ్ల పట్టాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైనవారందరికీ న్యాయం చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే వినోద్ జోక్యం చేసుకొని అర్హులైనవారందరికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరిక్రిష్ణ, మందమర్రి సింగరేణి జీఎం దేవేందర్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, మాజీ జడ్‌పీటీసీ రౌతు సత్తయ్య, ఆర్‌అండ్‌ఆర్ నిర్వాసితులు స్థానికులు పాల్గొన్నారు.



ఇండ్ల పట్టాలు అందజేస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గురువారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

అన్నదానం అన్నింటికన్నా మిన్న

భీమిని, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని ఎంపీడీవో గంగ మోహన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయం వార సంతలో ప్రతీ గురువారం శ్రీరామ సేవా సమితి మాజీ ఎంపీపీ రాజేశ్వరిలక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీడీవో గంగమోహన్ ప్రారంభించి మాట్లాడారు. ఏపీవో భాస్కర్ రావు, శ్రీరామ సేవా సమితి అధ్యక్షుడు లక్ష్మణ్, దేవమెండి కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

మందమర్రిరూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సారంగపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గురువారం చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పొలంలో బాగా ఆరిన తర్వాతనే వరి కోతలు చేపట్టాలని సూచించారు. గింజలో తేమ శాతం 14 నుంచి 17 శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఏవో కిరణ్మయి, ఏఈవోలు తిరుపతి, కనకరాజు, రైతులు రాయమల్లు, పిరోజ్, లింగారెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జన్నారం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం జన్నారంలోని పొనకల్ గ్రామంలో అగ్నిమాపక శాఖ అధికారులు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. గ్యాస్, ఎలక్ట్రిక్ ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఆర్పే పద్ధతిని చూపించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఫైర్‌మెన్ శివకృష్ణ, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.



చిన్నారులకు పోషకాహారం అందించాలి

బెజ్జూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పౌషకాహారం అందించాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పాపన్నపేట 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల ఎత్తు, బరువు పరిశీలిం చారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్‌లు బాలాజీ, ప్రవీణ్, కృష్ణమూర్తి, సూపర్‌వైజర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 1996-97 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవి కాలంలో దాహార్తి తీర్చుకునేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని, వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వేసవిలో ఎండ దెబ్బ తాకకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలభారతి యాజమాన్యం వసీం, గుళ్లపల్లి నాగేశ్వర్ రావు, రియాసత్ అలీ, వసీం బాయి, పంజాల, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వంట పాత్రల పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం మధ్యాహ్న భోజన వంట పాత్రలను ఎంఈవో రాథోడ్ సుభాష్ పంపిణీ చేశారు. మండలంలోని 16 పాఠశాలలకు పంపిణీ చేశామని చెప్పారు. మిగితా 37 పాఠశాలలకు శుక్రవారం అందజేస్తామని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల సిబ్బంది తెలిపారు.

పల్లెల్లో పాలన అస్తవ్యస్తం



నిధుల లేమితో పరిష్కారం కాని సమస్యలు

గ్రామాల్లో పాలక వర్గం లేకపోవడంతో నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు

చిన్న పంచాయతీల్లో ట్రాక్టర్ల ఈఎంఐల చెల్లింపునకు అవస్థలు

గ్రామ పంచాయతీ పాలక మండళ్ల పదవీకాలం ముగియడంతో సుమారు 14 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. వారికి ఇతర బాధ్యతలు ఉండడంతో పంచాయతీలపై దృష్టి పెట్టే పరిస్థితి లేదు. పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు ఆగిపోయాయి. దీంతో మెజార్టీ పల్లెల్లో పాలన పడకేసింది.

చింతలమానేపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో అభివృద్ధి మాట అటుంచితే సమస్యలే పరిష్కారానికి నోచుకోవడం లేదు. చాలా చోట్ల తాగునీరు, పారిశుధ్య సమస్యలు నెలకొన్నాయి. సర్పంచుల పదవీ కాలం గత ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. అప్పటి నుంచి పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ప్రభుత్వాల నుంచి నిధులు లేక పోవడంతో సుమారు 15 నెలలుగా పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి పరిపాలన సాగిస్తు న్నారు. ఇటీవల వసూలు చేసిన పన్నుల నుంచి కొంత డబ్బు ఖర్చు చేసినా గ్రామాల్లో కుంటుపడ్డ అభివృద్ధి పనులకు అవి ఏ మాత్రం చాలడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగిసిందని, ఇప్పటికైనా ప్రభు త్వం నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

15 మండలాల పరిధిలో..

జిల్లాలో 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సుమారుగా కోటిన్నర పైనే డబ్బులు విడుదల చేయాల్సి ఉంది. సర్పంచుల పదవీ కాలం ముగిసి 15 నెలలు కావస్తున్నా నేటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సీ) నుంచి మాత్రం పంచాయతీ కార్మికుల వేతనాలు విడుదల చేస్తుంది. జిల్లాలోని గ్రామ పంచాయతీ వర్కర్లకు వేతనాలను నెలనెలా అందడం లేదు. రెండు, మూడు నెలలకో సారి విడుదల చేస్తుంది.

అది కూడా పంచాయతీ కార్మికులు తమకు నెలనెలా వేతనాలు అందజేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నాలు చేస్తే నిధులు విడుదల చేసినట్లు తెలుస్తోంది. కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు పాలకవర్గం లేని కారణంగా విడుదల చేయడం లేదు. పాలక వర్గం బాధ్యతల చేపట్టితే తప్ప ఆ నిధులు వచ్చే పరిస్థితి లేదు. అటు కేంద్ర నిధులు రాక, ఇటు రాష్ట్రం నిధులు విడుదల చేయక గ్రామ పంచాయతీల నిర్వహణ ప్రత్యేకాధికా రులకు తలకు మించిన భారంగా మారిందని చెబుతున్నారు.

పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా..

జిల్లాలో గత ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతీ గ్రామ పంచాయతీకి ఓ ట్రాక్టర్‌ను అందజేసింది. ఈ ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరించడం తద్వారా చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడం, మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీళ్లు పట్టడం వంటి పనులు చేపడుతున్నారు. ఆర్థికంగా మెరుగైన గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లను నేరుగా డబ్బులు చెల్లించి కొనుగోలు చేశారు. రెవెన్యూ తక్కువగా ఉన్న గ్రామ పంచాయతీల్లో బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. రెవెన్యూ గ్రామ పంచాయతీలు నెలనెలా ఈఎంఐలు చెల్లించేలా కొనుగోలు చేశారు. ప్రసుత్తం రెవెన్యూ లేని గ్రామ పంచాయతీలు ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించేందుకు సైతం ఇబ్బందు లు పడాల్సి వస్తున్నది. తాగునీరు. పారిశుధ్యం వంటి సమస్యలు ఉన్న చోట్ల నిధులు లేక పరిష్కారం కావడం లేదు. ఆయా గ్రామ పంచాయతీల్లో అత్యవసర పనులకు కార్యదర్శులు అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల కొన్ని పంచాయతీల్లో తమ వల్ల కాదని కార్యదర్శులు సైతం చేతులెత్తేశారు.

త్వరలో నిధులు విడుదల అయ్యే అవకాశం..

భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి

కేంద్రం అందించే నిధులు త్వరలో విడుదలయ్యే అవకాశం ఉంది. పంచాయతీ పాలకవర్గం లేక కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. త్వరలో వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో పనులు చేపడుతున్నాం. పంచాయతీ కార్మికులకు మాత్రం వేతనాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

అర్హులు రుసుం చెల్లించేలా చూడాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీపీవో భిక్షపతిగౌడ్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): లే అవుట్ లేని భూముల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్-2020 పథకంలో భాగంగా అందిన దరఖాస్తులలో అర్హులైన లబ్ధిదారులు రుసుం త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ అన్నారు. హైదరాబాద్ నుంచి ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం వీడియ కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో ఎల్ఆర్ఎస్ రుసుం వసూలు ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రుసుంలో 25 శాతం మినహాయింపుతో ఈ నెల 30వ తేదీ వరకు చెల్లించే విధంగా ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అద నపు కలెక్టర్ దీపక్ తివారి, డీపీవో భిక్షపతిగౌడ్‌లతో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్ఆర్ఎస్ పథకం కింద 7,212 దరఖాస్తులు అందాయని చెప్పారు. విచారణ అనంతరం 5,470 అర్హులైన దరఖాస్తుదారులు రుసుం చెల్లించా ల్సిం దిగా గుర్తించామని అన్నారు. ఇప్పటి వరకు 1,022 మంది దరఖాస్తు దారులు రుసుం చెల్లించారని తెలిపారు. మిగిలిన వారి నుంచి రుసుం వసూలు చేసే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో పట్టణ ప్రణాళికాధికారి యశ్వంత్, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

వాంకిడి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండలు ముదురుతున్నందున గత సంవత్సరం అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన కూలీలకు పని కల్పించాలని, కొత్త పనుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీవో శ్రావణ్, ఎంపీఓ ఖాజా అజీజోద్దీన్ పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

దహెగాం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గెర్రె గ్రామంలో గురు వారం క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత వ్యసనాల కు దూరంగా ఉండాలన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తే విరాట్ కోహ్లి, బుమ్రా లాంటి క్రీడాకారులను తయారు చేయవచ్చని చెప్పారు. అనంతరం క్రికెట్ పోటీల్లో గెలిచిన కన్నెపల్లి జట్టుకు బహుమతి అందజేశారు. కార్యక్ర మంలో నాయకులు షాకీర్, ప్రశాంత్, మల్లేష్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధికి పాటుపడాలి

రెబ్బెన, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వారసత్వంగా సింగరేణిలో ఉద్యోగంలో చేరే యువకులు సంస్థ అభివృద్ధికి పాటుపడాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో గురువారం పలువురుకి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఖైరిగూడ పీవో మచ్చగిరి నరేందర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్ పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యుడైస్ ప్లస్ థర్డ్ పార్టీ వెరిఫికేషన్ ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన ఫాంను సీఆర్పీలతో కలిసి డీఎడ్, బీఎడ్ విద్యార్థులు థర్డ్ పార్టీ వెరిఫికేషన్ చేస్తున్నట్లు ఎంఈవో సుభాష్ తెలిపారు. యుడైస్ ప్లస్ ఫాంను పరిశీలించి అందులో ఏమైనా తప్పులు ఉంటే స్కూల్ రిపోర్ట్ కార్డులో రాస్తూ సంబంధిత ప్రధానోపాధ్యాయులకు తెలియజేయనున్నామని తెలిపారు.

బీఆర్ఎస్ సభకు తరలిరావాలి

సిర్పూర్(యు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ సభకు కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోడసం ధర్మారావు, కోరారు. మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్ రావు, నాయకులు ఆర్క నాగోరావు, కుమ్ర బీంరావు, పెందోర్ మాధవ్ రావు, సిడం సుభాష్, భుజంగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడిగా కోట్నాక విజయ్, వ్యవస్థాపక అధ్యక్షుడిగా బుర్స పోచయ్య ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో గురువారం జిల్లా కేంద్రంలో బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు వారిని సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు ప్రసాద్‌గౌడ్, జయరాజ్, వెంకన్న, దీపక్, మురళీగౌడ్, శ్రీకాంత్, శంకర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కౌటాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కల్పించేందుకే ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాసం కౌంటర్లలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనకబడి తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అల్పసంఖ్యాక వర్గాలు, ఇతర వెనకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పనకు కృషి చేస్తుందన్నారు. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రాయితీతో కూడిన రుణ సదుపాయం కల్పించ నుందని చెప్పారు. అర్హత గల అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఎల్ఆర్ఎస్-2020లో భాగంగా భూముల క్రమబద్ధీకరణ రుసుం చెల్లించేందుకు లబ్ధిదారులను ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరిగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ ఏరియాలో నూతనంగా నిర్మిస్తున్న సీఎస్‌సీ కాంప్లెక్స్ పనులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలోగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం మండలంలోని నాగెపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ దశను పరిశీలించారు.. నిరుపేదలకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. లబ్ధిదారులు త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

అగ్నివీర్ ఎంపిక పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకుల నుంచి అగ్నివీర్ ఎంపిక పరీక్షకు సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూమెంట్ ఆఫీసర్ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఆర్మీలో వివిధ కేటగిరిల వారీగా అగ్నివీర్‌లో జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీన్ క్లర్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్రీవీర్ ట్రేడ్‌మెన్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఐటీఐ, డిప్లమా, ఎన్‌సీసీ అర్హత పొందిన అభ్యర్థులకు బోనస్ మార్కులు ఉంటాయని తెలిపారు. 13 భాషలలో కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఆన్‌లైన్ విధానంలో చేపడు తామని తెలిపారు. ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సిర్పూర్(యు), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దేవుగూడలో గల అవ్వల్‌పేన్ దేవత గురువారం మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా జివితి తాలుక మరాయ్ పాటన్‌లోని మరాయ్ అమ్మ వారి ఆలయానికి చేరుకోవడంతో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మరాయ్ పాటన్ ఆలయనికి చేరడానికి మూడు రోజులు పట్టిందని భక్తులు తెలిపారు. తమ ఇష్ట దైవంతో మహారాష్ట్రకు కాలినడకనే చేరుకున్నామని తెలి పారు. కార్యక్రమంలో కుమరం భీం మనవడు సోనేరావు, ఆత్రం జ్యోతిరాం, ఆత్రం మారు, మడావి ఇస్రు, ఆర్క లచ్చు, ఆత్రం సంతోష్, ఆత్రం మహేష్ ఆత్రం బల్వంత్‌రావు పాల్గొన్నారు.

8న ఉర్సు ఉత్సవాలు

సిర్పూర్(టి), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సయ్యద్ తాలీబ్ అలీషా బాబా దర్గా వద్ద మే 8, 9 తేదీల్లో ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దర్గా ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉర్సు ఉత్సవా లకు వచ్చే ప్రజల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కమిటీ సభ్యులు కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

కెరమెరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలో భూభారతి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, నీటి ఎద్దడిపై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అంజద్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌లు కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ భారతి పథకంలో రైతులకు భూ సమస్య లు పరిష్కరించేందుకు ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల పనులు వేగవంతం చేయాలని చెప్పారు. లబ్ధిదారులకు విడతల వారీగా బిల్లులు అందజే స్తామని చెప్పారు. అలాగే గ్రామాల్లో వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఏఈ విశ్వేశ్వర్, గణేష్, సతీష్, బొజ్జిరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండల కేంద్రలోని పోలీసు స్టేషన్‌ను గురువారం ఏఎస్పీ చిత్తరంజన్ తనిఖీ చేశారు. కేసులకు సంబంధించి ఫైళ్లను, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలని, ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. సిబ్బంది పోలీసు స్టేషన్‌లో ప్రతి గ్రామం గురించి అవగాహన కలిగి ఉండాలని ప్రజలతో మమేకమై ప్రజలకు మరింత చేరువ కావాలని తెలిపారు. ఉత్తమ పని తీరు కనబర్చిన వారికి ప్రతిఫలం దక్కుతుందని తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా స్పందించాలని సూచించారు .

నిలిచిన ఆర్టీసీ బస్సు సేవలు

- ప్రైవేట్ వాహనాల్లో తప్పని ప్రయాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ప్రైవేటు వాహనంలో వెళ్తున్న మండలవాసులు

దహెగాం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలానికి రెండు నెలలుగా ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. దీంతో మండలంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు గత ఫిబ్రవరి నెలలో చేపట్టడంతో ఆసిఫాబాద్ డిపో నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం నిలిచి పోయింది. అప్రోచ్ రోడ్డు పనులను నెల రోజుల్లోనే పూర్తి చేశారు. కానీ ఆర్టీసీ బస్సు సౌకర్యం తిరిగి పునరుద్ధరించడం లేదు. మారుమూల అటవీ ప్రాంత గ్రామాలైన మొట్లగూడ, రావులపల్లి, రాంపూర్, దిగిడ, లోహ, శంకరపురం తదితర గ్రామాలతో పాటు మండల కేంద్రం వాసులు ప్రైవేటు వాహనాల్లోనే అవసరాల నిమిత్తం కాగజ్‌నగర్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాలకు రాకపోకలు సాగిస్తుంటారు. దహెగాం మండల కేంద్రం నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి నిత్యం వందలాది ప్రైవేటు వాహనాలలో ప్రయాణం చేస్తుంటారు. మండల క్రేంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పట్టణాల నుంచి ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. దహెగాం మండల కేంద్రం నుంచి కాగజ్‌నగర్ 30 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ప్రైవేటు వాహనాల యజమానులు రూ.60 చార్జీ వసూలు చేస్తున్నారు. ఒక వ్యక్తికి రాను పోను ఛార్జీలు రూ.120 అవుతుందని వాపోతున్నారు. ప్రైవేటు వాహనాల్లో ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తుందని ప్రజలు చెబుతున్నారు. అదే విధంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతిని దులు స్పందించి దహెగాం మండల కేంద్రానికి కాగజ్‌నగర్ మీదుగా ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని మండల వాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఆసిఫాబాద్ ఆర్టీసీ డీఎం రాజశేఖర్‌ను ఫోన్‌లో సంప్రదించగా తాను ఇటీవలే బాధ్యతలు స్వీకరించానని చెప్పారు. ఈ సమస్య తన దృష్టికి రాలేదని చెప్పారు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగు వద్ద అప్రోచ్ రోడ్డు, వంతెనను పరిశీలించిన తరువాతో బస్సు సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.